క్లుప్తంగా

రైతు రుణమాఫీ చేయడం గొప్ప విషయం

మిర్యాలగూడ: సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయడం గొప్ప విషయమని జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 5,08,756 మంది రైతులకు లబ్ధి చేకూరిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు రైతులందరూ అండగా ఉండాలని కోరారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిగా వెంకటేష్‌యాదవ్



దేవరకొండ: యాదవ విద్యావంతుల వేదిక దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవరకొండ పట్టణానికి చెందిన నేతాళ్ల వెంకటేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బాలరాజుయాదవ్ బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

పేద ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం



మల్లిరెడ్డిగూడెంలో బోరు వేయిస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ సభ్యులు

హాలియా: పేదల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. అనుముల మండలంలోని మల్లిరెడ్డిగూడెంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను బుధవారం బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరు వేయించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి




రాఖీలు కట్టుకుంటున్న గ్రామస్తులు

కొండమల్లేపల్లి: హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని కొండమల్లేపల్లి మండలంలోని గన్యానాయక్‌తండా సర్పంచ్ రాములునాయక్ అన్నారు. బుధవారం గన్యానాయక్ తండాలో హిందూ ధర్మ రక్షాసమితి ఆధ్వర్యంలో ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కొండమల్లేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ సేవా జిల్లా ఇన్‌చార్జి కొత్త అఖిల్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



బొర్రాయిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో నోట్‌బుక్స్ అందజేస్తున్న డాక్టర్ ఆనంద్

త్రిపురారం: మండలంలోని బొర్రాయిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బంజారా మహిళ ఎన్‌జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్, హరిప్రియ సంయుక్తంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నజీర్, తులసీరాం, అభయాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్ ఈసీ గోపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి డెంగీ బాధితులు

గుర్రంపోడు: మండలంలోని చామలేడు గ్రామంలో డెంగీ బాధితులు శిలువేరు పార్వతమ్మ, పెద మల్లయ్యను బుధవారం 108 వాహనంలో నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వీరికి రక్తకణాలు తక్కువగా ఉన్నాయని, మరో ఇద్దరు గ్రామంలోనే కోలుకుంటున్నారని వైద్యాధికారి డాక్టర్ భవానీ చక్రవర్తి తెలిపారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ సూచనలు ఇచ్చారు. గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీతో పాటు సాయంత్రం ఫాగింగ్ చేశారు. గ్రామస్తులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి సూచించారు.

క్యాంపు కార్యాలయాల ముట్టడికి యత్నం

- బీజేపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



దేవరకొండ: బీజేపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



హాలియా: బీజేపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు



మిర్యాలగూడ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం చేపట్టిన ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి ఉద్రిక్తంగా మారింది. సీఎం కేసీఆర్ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ క్యాంపు కార్యాలయాన్ని బుధవారం బీజేపీ నాయకులు ముట్టడించేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయగా తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నరసింహ, అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, కళ్యాణ్‌నాయక్, వినోద్ రాథోడ్, గుండాల అంజయ్య, సైదులు, సాంబశివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

హాలియా: అక్రమ అరెస్టులతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బీజేపీ చేపట్టిన ఉద్యమాన్ని ఆపలేరని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంపెల్లి శ్రీనివాస్, నాగార్జునసాగర్ నియోజకవర్గ నాయకురాలు కంకణాల నివేదిత రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదని, ప్రజా సమస్యలు పట్టించుకోలేదని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం హాలియా పట్టణంలోని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీజేపీ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నెల్లికల్లు లిఫ్ట్ ఏర్పాటు, దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలాయన్నారు. రాష్ట్రంలో రజాకార్లను తలపిస్తున్న బీఆర్‌ఎస్ పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. అరెస్టయిన వారిలో పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ కన్వీనర్ చలమల వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు చెన్ను వెంకటనారాయణరెడ్డి, నియోజకవర్గ ఎస్టీ మోర్చా కన్వీనర్ పాల్తీ శంకర్‌నాయక్, బీజేవైఎం కోకన్వీనర్ వెంకట్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ చిట్టిమాల శివ, మండల ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన ఆంజనేయులు, మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ ఎరుకొండ పద్మ, తిరుమలగిరి మండల అధ్యక్షుడు ఇస్లావత్ పాండునాయక్, నగేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడంలో విఫలం

మిర్యాలగూడ టౌన్: డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు క్యాంపు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకోవడంతో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా అంతకుముందే బీజేపీ కార్యాలయంలో ఉన్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావును వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దళిత బంధు, బీసీలకు ఆర్థికసాయం అంటూ సీఎం కేసీఆర్ తూతూ మంత్రంగా పథకాలు అమలు చేస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య ఏమైందని ప్రశ్నించారు. మద్యం షాపులను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు నేటి వరకు కూడా నష్టపరిహారాన్ని చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణావత్ రతన్‌సింగ్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, చిల్లంచర్ల అభి, మూల రాజిరెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, బంటు గిరి, కొండేటి సరిత, కొండేటి శేఖర్ తదితరులున్నారు.

చంద్రయాన్–3 విజయంతో సంబరాలు

మిర్యాలగూడ టౌన్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం రాత్రి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. భారతదేశం కీర్తిపతాకాన్ని చంద్రుడి మీద ఎగురవేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంపోడు: ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో యువకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లిం మైనార్టీల సంబురాలు

మిర్యాలగూడ: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో మిర్యాలగూడ పట్టణంలోని అరాఫత్ మస్జిద్ ఆవరణలో ముస్లిం మైనార్టీలు బుధవారం సాయంత్రం స్వీట్లు పంపిణీ చేసి సంతోషం వ్యక్తం చేశారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఇస్రో చైర్మన్ సోమనాథ్, శాస్త్రవేత్తలకు వారు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, షాదీఖానా కమిటీ చైర్మన్ హఫీజుద్దీన్‌పాషా, ముఫ్తీ మహమ్మద్, ఇమ్రాన్, మజహరి, మహ్మద్ అబ్దుల్ అల్లాంపాషా తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు ఆదర్శ పాఠశాల వసతి గృహంలో..

నిడమనూరు: నిడమనూరు ఆదర్శ పాఠశాలలోని వసతి గృహంలో బుధవారం సాయంత్రం విద్యార్థులు చంద్రయాన్–3 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ల్యాండర్ చంద్రుడిపై అడుగిడిన వెంటనే విద్యార్థులు చప్పట్లు కొడుతూ సంతోషం వ్యక్తం చేశారు. జై భారత్, జై చంద్రయాన్–3 అంటూ నినాదాలు చేశారు.



మిర్యాలగూడ: స్వీట్లు తినిపించుకుంటున్న ముస్లిం మైనార్టీలు



మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు

దివ్యాంగులకు ఆసరా పింఛన్ చెక్కుల పంపిణీ

హాలియా: పట్టణంలోని చైతన్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెంచిన రూ.4016 పింఛన్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే నోముల భగత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కమిషనర్ వీరారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

గుర్రంపోడు మండల కేంద్రంతో పాటు తిరుమలగిరి మండలంలోని గట్టుమీదతండా, సపావత్‌తండా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు



హాలియాలో దివ్యాంగులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ తిరుమలగిరి మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, జిల్లా నాయకులు కేతావత్ భిక్షానాయక్, వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ, మండల అధికార ప్రతినిధి సింగం ప్రవీణ్‌కుమార్, ప్రచార కార్యదర్శి నల్లబెట్టి పురుషోత్తం మండల సీనియర్ నాయకుడు మేకల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ పురం వేణు ఉన్నారు.

ఎమ్మెల్యే భగత్‌కు బీఆర్‌ఎస్ శ్రేణుల ఘన స్వాగతం



ఎమ్మెల్యే నోముల భగత్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

హాలియా: వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నోముల భగత్‌ను సీఎం కేసీఆర్ మరోసారి ప్రకటించిన తర్వాత ఎమ్మెల్యే భగత్ బుధవారం హైదరాబాద్ నుంచి హాలియాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. హాలియా పట్టణ ప్రధాన సెంటర్‌లో క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అకాల మరణం తర్వాత తాను ఎమ్మెల్యేగా ఎన్నికై గడిచిన రెండేళ్లలో ప్రజల మధ్యనే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసినట్లు తెలిపారు. జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. సాగర్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఇరిగినేని అంజయ్య, ఎంపీపీలు, జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

త్రిపురారంలో బైక్ ర్యాలీ..

త్రిపురారం: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ బుధవారం హైదరాబాద్ నుంచి హాలియాకు వెళ్తుండగా త్రిపురారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన మర్ల చంద్రారెడ్డి, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కలగాని శ్రవణ్ కుమార్, మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్, జిల్లా నాయకులు కామర్ల జానయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నోముల నర్సింహయ్య విగ్రహం వద్ద నివాళి..

నిడమనూరు: మండలంలోని వేంపాడ్ వద్ద దివంగత నేత నోముల నర్సింహయ్య విగ్రహానికి ఆయన కుమారుడు ఎమ్మెల్యే నోముల భగత్ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బాబూరావునాయక్ తదితరులు ఉన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను బీఏ(ఈహెచ్‌పీ), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), (బీజెడ్‌సీ) కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. రవీంద్రాచారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈ కళాశాలలో బాలురకు మాత్రమే ప్రవేశాలు ఉన్నాయని, భోజనంతో పాటు పుస్తకాలు, దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9642046006 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికల గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో 26(ఎస్టీలకు మాత్రమే), బైపీసీలో 10(ఎస్టీ–8, బీసీ–1, ఓసీ–1) సీట్లకు గాను ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి. శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పదో తరగతి ఒరిజినల్ మెమోతో పాటు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి

దేవరకొండ: జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివ, వెంకటేష్, రాజేష్ తదితరులున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కట్టంగూర్: గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, వనం మైసమ్మ తల్లి విగ్రహాలను మండల కేంద్రంలోని కురుమర్తి రోడ్డు వెంబడి నూతనంగా నిర్మించిన ఆలయాల్లో బుధవారం పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజారులు యంత్ర ప్రతిష్ట, మంగళ హారతితోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

చండూరు: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, కర్ణాటకలోని విజయపురం ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ అన్నారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో చేనేత కళాకారుల కుటుంబాలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. మండల అధ్యక్షుడు నామని జగన్నాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, మునుగోడు నియోజగవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కర్నాటి రవితేజ, గట్టుప్పల మండల ఇన్‌చార్జ్ రాపోలు గోపీనాథ్, శక్తి కేంద్ర ప్రముఖ్‌లు, ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి సమగ్రాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మన ఊరు-మన ప్రభుత్వం-మన పథకాలు కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లిలో రూ.90లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజురెడ్డి, జెడ్పీటీసీ సరస్వతమ్మ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, నాయకులు పస్నూరి యుగేంధర్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

కొండమల్లేపల్లి: ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కొండమల్లేపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సి. విజయలక్ష్మి అన్నారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన వాయిస్ ఫర్ గరల్స్ కార్యక్రమంలో ఆడపిల్లల రక్షణ, ఆడపిల్లల పట్ల జరిగే మోసాలు, అన్యాయాలు తదతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 30వ తేదీ వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఈ వాయిస్ ఫర్ గరల్స్ కార్యక్రమం జరుగుతుందని, ఆయా పాఠశాలల నుంచి 15మంది బాలికల చొప్పున ఎంపిక చేసి నల్లగొండలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో వారికి కౌమార దశలో వచ్చే శారీరక మార్పులు, మానసిక, సామాజిక, సమస్యలపై ఎలా స్పందించాలి, ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

త్రిపురారం: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. త్రిపురారం మండలం రాజేంద్రనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడితండాలో వెలసిన కనకదుర్గమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఆలయ పాలక వర్గ సభ్యులకు రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో యడవెల్లి దిలీప్‌రెడ్డి, హరియానాయక్, నరేష్‌నాయక్, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

అరకకు పెరిగిన డిమాండ్

- ఒక్క రోజుకు రూ.2వేలు



పత్తి చేనులో గుంటుక తోలుతున్న రైతు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక వ్యవసాయంలో భాగంగా ట్రాక్టర్ వినియోగం పెరగడంతో కీలకమైన కాడెద్దు కనుమరుగవుతున్నాయి. అరకతో ఒకరోజు చేసే పనిని ట్రాక్టర్ ఒక గంటలో పూర్తిచేస్తుంది. చాలా మంది రైతులు ట్రాక్టర్, ఇతర యంత్రాలతోనే వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారు. కానీ పత్తి మొలకెత్తిన తర్వాత కలుపు నివారణకు, తేమశాతం పెంచేందుకు మాత్రం అరకతో కూడిన దౌరతోనే సాగు చేయాల్సి ఉండటంతో అరకకు డిమాండ్ పెరిగింది. రైతులు మనిషితో సహా అరకతో కూడిన కాడెద్లకు ఒక్క రోజుకు రూ. 1500 నుంచి రూ.2వేల వరకు చెల్లిస్తున్నారు.

చేతినిండా పని..

ప్రస్తుతం కాడెద్ల జతలు తక్కువగా ఉండటంతో ఏ గ్రామంలో చూసినా అరకకు డిమాండ్ పెరిగింది. పొలం పనుల్లో గొర్రు, అరకకు కాడెద్లను వినియోగిస్తుంటారు. దీనితో పాటు పత్తిలో కలుపు నివారణకు, తేమ కొరకు కాడెద్లను వినియోగిస్తుండటంతో అరక ఉన్న రైతులకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రతిరోజు వారికి చేతి నిండా పని దొరుకుతోంది. ట్రాక్టర్ ఉన్న రైతులు సైతం పత్తిలో అరక వినియోగం తప్పనిసరి కావడంతో వారు డిమాండ్ చేసినంతా చెల్లిస్తున్నారు.

పశువులను పోషించలేక..

ఒకప్పుడు ప్రతి ఇంట్లో రైతుకు కాడెద్లు, ఆవులు తప్పనిసరిగా ఉండేవి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయం మూలంగా బీడు భూములే లేకుండా పోతున్నాయి. దీంతో అనే గ్రామాల్లో పశువుల మేత కోసం స్థలం లేక వాటిని అమ్ముకుంటున్నారు. అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ఒకటి రెండు గ్రామాల్లోనే పశువులు ఎక్కువగా ఉన్నాయి. కాడెద్లు పోషించే స్థోమత రైతులకు ఉన్నా వాటికి నీరు పెట్టడం, గ్రాసం కొరతతో వాటిని అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అరకతో వ్యవసాయం చేసే వాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్: బీఆర్‌ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆ జాబితాను మార్చాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాల వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 62శాతం బీసీలకు బీఆర్‌ఎస్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో కేవలం 23 సీట్లు మాత్రమే కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంతేకాకుండా ఆరు శాతం కూడా లేని రెడ్డి కులస్తులకు 40 సీట్లు ఎలా కేటాయిస్తారని మండిపడ్డారు. ఈటల రాజేందర్‌ను బర్తరఫ్ చేసి ఆ స్థానంలో రెడ్డి సామాజిక వర్గాన్ని నిలబెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడుగురు మహిళలకు మాత్రమే టికెట్లు ఇచ్చారని, అందులో ఒక్క బీసీ మహిళ కూడా లేకపోవడంతో కేసీఆర్ కుటుంబానికి బీసీలు అంటే ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉండి మోసపోయిన బీసీలతో ఈ నెల 26న హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, రాంబాబు యాదవ్, శేఖర్, సతీష్ తదితరులున్నారు.

ఎంఎస్ఎఫ్ కమిటీ ఎన్నిక

దేవరకొండ: పట్టణంలోని గాయత్రి ఒకేషనల్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చరణ్, ఉపాధ్యక్షుడిగా సమంత్‌ను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకూరి నాగరాజు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాంబాబు, హేమంత్, భరత్, కరుణ, శిరీష తదితరులున్నారు.

రాబోయే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

రామగిరి(నల్లగొండ): రాబోయే ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ అన్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆయన దరఖాస్తు చేశారు. అనంతరం మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా బీసీలకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే అధికారం కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలన్నారు. 25 సంవత్సరాలుగా తిప్పర్తి మండలంతోపాటు నియోజకవర్గంలోని పేద ప్రజలకు చంద్ర ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వార్డు మెంబర్, సర్పంచ్, జెడ్పీటీసీగా గెలిచి చేసి ప్రజలకు సేవ చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

ఎన్నికల్లో సహాయ నిరాకరణకు తీర్మానం

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు బల్గూరి నగేష్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం అసమ్మతి వర్గం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాగార్జునసాగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే నోముల భగత్‌ను మార్చాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో సహకరించేది లేదని తీర్మానం చేశారు. స్థానికుడికి టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వెల్ల పూరి కరుణాకర్ రావు, రైతు బంధు సమితి అధ్యక్షుడు బల్గూరి నగేష్‌గౌడ్, షేక్ సయ్యద్‌మియా, కిరణ్‌కుమార్, సర్పంచులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

మిర్యాలగూడ: రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని పలువురు ఉద్యోగులు కోరారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని రిసోర్స్ కేంద్రంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 22వేల మంది సమగ్ర శిక్షలో గత 18 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు వారు లేఖలు పంపించారు. ఈ కార్యక్రమంలో రవి, లక్ష్మమ్మ, పాండు, శారద, డేవిడ్, వెంకటేశ్వర్లు, నవనీత, గాంధీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.